క్లుప్తంగా

జొన్న కొనుగోళ్లు నిలిపివేత

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో మార్క్‌ఫెడ్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రంలో జొన్న పంట నిల్వలు ఎక్కువగా ఉండడం, వాతావరణంలో మార్పులు రావడంతో ఈ నెల 20 నుంచి 22 వరకు జొన్న కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ మారుతి డొంగ్రె, పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల రైతులు గమనించి ఈ నెల 23 నుంచి జొన్న పంట అమ్మకానికి తీసుకొచ్చి అధికారులకు సహకరించాలని ప్రకటనలో కోరారు.

ఇంద్రవెల్లికి చేరిన సైకిల్‌యాత్ర



సైకిల్‌యాత్ర నిర్వహిస్తున్న స్వామికి స్వాగతం పలుకుతున్న నాయకులు

ఇంద్రవెల్లి: జగిత్యాల కామదేనువు గో సంరక్షణ గోశాల నుంచి కేదర్‌నాథ్ వరకు ఆగస్త్య స్వామి చేపట్టిన వేల గోమాతల రక్షణార్థం సంకల్ప సైకిల్‌యాత్ర సోమవారం ఇంద్రవెల్లి మండలకేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా సైకిల్‌యాత్ర నిర్వహిస్తున్న ఆగస్త్య స్వామికి బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. నాయకులు ఆరెల్లి రాజలింగు, రాజు ముండే తదితరులు ఉన్నారు.

'కక్ష సాధింపు చర్యలు సరికాదు'

ఉట్నూర్‌రూరల్: తనపై అధికార పార్టీ నాయకుల కక్ష సాధింపు చర్యలు సరికాదని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉట్నూర్ పోలీసుస్టేషన్‌లో తనపై అకారణంగా కేసు నమోదు చేశారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నవంబర్, 2023లో ఉట్నూర్ నుంచి ఖానాపూర్‌కు వస్తున్న తనను కొత్తగూడ చెక్‌పోస్టు వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డగించే ప్రయత్నం చేసి హంగామా చేశారని, ఇప్పుడే వారే కేసు నమోదు చేయించారని పేర్కొన్నారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న వారిని ఎప్పటికీ వదలమని హెచ్చరించారు.

కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: భారత ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేసిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని సోమవారం బీజేపీ ఉట్నూర్ మండల శాఖ ఆధ్వర్యంలో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు బింగి వెంకటేశ్ అన్నారు. మోడీ ప్రభుత్వం పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెప్పగా ప్రపంచ దేశాలు మోడీ వైపు చూస్తుండగా కాంగ్రెస్ నాయకులు మోడీ దిష్టిబొమ్మ దహనం చేయడం సిగ్గుచేటన్నారు. నాయకులు కొండేరి రమేశ్, సీపతి లింగాగౌడ్, జితేందర్, భీమన్న తదితరులు ఉన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న గంగాసింగ్

నార్నూర్: మండల ఎంపీడీవోగా గంగాసింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పని చేస్తున్న ఎంపీడీవో జవహర్ లాల్‌ను జెడ్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన గంగాసింగ్‌ను ఎంపీవో సాయిప్రసాద్, ఈజీఎస్ ఏపీవో సురేందర్ రాథోడ్, సిబ్బంది శాలువాతో సన్మానించారు.

ఏజెన్సీ ఎస్సీలకు పహాణీ పత్రాలు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న నిరంజన్

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా నివాసముంటున్న ఎస్సీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేయడంతో పాటు వారు సాగు చేస్తున్న భూములకు సర్వే నిర్వహించి రుణ సౌకర్యార్థం పహాణీ పత్రాలు ఇవ్వాలని ప్రధాన్ పురోహిత్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నిరంజన్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ జాడి రాజలింగుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని ఎస్సీలకు కనీస హక్కులు కూడా లేవన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు ఏజెన్సీ ఎస్సీల విషయంలో సానుకూలంగా ఉన్నారన్నారు.

చివరి దశకు జొన్న కొనుగోళ్లు

- తాంసి సబ్‌మార్కెట్‌కు పోటెత్తిన పంట
- 57 వేల క్వింటాళ్ల కొనుగోళ్లు పూర్తి
- మార్కెట్‌లో వసతులు లేక ఇక్కట్లు పడ్డ రైతులు



మార్కెట్‌లో జొన్నలు తూకం వేస్తున్న హమాలీలు

తాంసి: యాసంగి సీజన్‌లో భాగంగా తాంసి, భీంపూర్ మండలాల రైతులు ఈసారి అధికంగా జొన్న పంట సాగు చేశారు. రైతులు సాగుచేసిన జొన్న పంటను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో సైతం తాంసి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటివరకు తాంసి, భీంపూర్‌తో పాటు ఇతర మండలాలకు చెందిన 1700 మంది రైతుల నుంచి 57వేల క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేసి గోదాంలకు తరలించారు. ప్రస్తుతం జొన్నల కొనుగోలు ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది. వారం రోజుల క్రితం వరకు మార్కెట్‌కు నిత్యం ఐదు వేల క్వింటాళ్లకు పైగా జొన్నలు వస్తుండగా ప్రస్తుతం వెయ్యి క్వింటాళ్ల లోపు మాత్రమే వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఆగుతూ.. సాగుతూ..

తాంసి సబ్ మార్కెట్‌యార్డులో చేపట్టిన జొన్నల కొనుగోలు ప్రక్రియ ప్రారంభం నుంచే ఆగుతూ.. సాగుతూ జరగడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. మార్కెట్ ప్రారంభంలోనే రైతులు జొన్నలను అధికంగా తీసుకురావడంతో మార్కెట్‌కు పెద్ద ఎత్తున జొన్నపంట పోటెత్తింది. జొన్న పంట నిల్వ చేసుకోవడానికి మార్కెట్‌లో స్థలం లేక రైతులు రోడ్డు పక్కన కుప్పలుగా పోశారు. రోడ్డు పక్కనే పంట ఉండడంతో రక్షణ కోసం రైతులు రాత్రి పగలు అక్కడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోడ్డు పైన జొన్న కుప్పలను వేయడంతో పంటను తూకం వేయడం, తరలించడం ఆలస్యం కావడంతో రెండు నుంచి మూడు రోజుల పాటు జొన్నల కొనుగోళ్లను అధికారులు తరచూ నిలిపివేశారు. కొనుగోళ్లు నిలిపివేయడంతో పంటను తీసుకొచ్చిన రైతులు పంట అమ్ముకునే వరకు మార్కెట్‌లో పడిగాపులు పడ్డారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కాకుండా రైతులు ఇష్టానుసారంగా పంటను తీసుకురావడంతో మార్కెట్‌లో ప్రతీరోజు పంట నిలవ్వలు పేరుకుపోయాయి. కాగా ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయి.



రోడ్డు వెంట కుప్పలుగా జొన్న పంట

వసతులు లేక అవస్థలు..

మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో రైతులకు సరైన వసతులు లేక అవస్థలు పడ్డారు. తాగునీరు, నీడ వసతి లేక రైతులు చెట్ల కింద, పంట కుప్పలపై సేదదీరారు. రోజుల తరబడి మార్కెట్‌లో నిరీక్షించిన రైతుల దుస్థితి వర్ణనాతీతంగా ఉంది. ఇప్పటికైనా పంటలు కొనుగోళ్లు చేసే సమయంలో తాగునీరు, నీడ వసతి కల్పించాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోళ్లు జరుగుతున్నాయి..



మార్కెట్‌యార్డులో రైతులు తీసుకొచ్చిన జొన్నలను రోజువారీగా కొనుగోలు చేస్తున్నాం. ఇప్పటివరకు 57వేల క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేశాం. కొనుగోలు చేసిన పంటను ఎప్పటికప్పుడు గోదాంలకు తరలిస్తున్నాం. లారీల కొరత, గన్నీ బ్యాగుల కొరతతో కొనుగోళ్లను కొన్నిసార్లు నిలిపివేశాం. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేస్తున్నాం.

– సి. కేశవ్, పీఏసీఎస్ సీఈవో, తాంసి

మార్కెట్ యార్డులో సౌకర్యాలు కల్పించాలి



జొన్న పంట పరిశీలిస్తున్న నాయకులు

నార్నూర్: మండల కేంద్రంలోని ఉప మార్కెట్ యార్డులో రైతులకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అయినా మార్కెట్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని బీజేపీ మండల అధ్యక్షుడు బిక్షపతి రాథోడ్ అన్నారు. సోమవారం మార్కెట్ యార్డులో రైతులు తీసుకొచ్చిన జొన్న పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు కోట్ల రూపాయల లాభం వస్తున్నప్పటికీ రైతులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. మంచినీళ్ల సౌకర్యం కూడా కల్పించలేని దుస్థితి ఉందన్నారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షాధారులకు ఎమ్మెల్యే భిక్ష



దీక్షాధారులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమవారం హనుమాన్ దీక్షాధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ నామస్మరణతో కార్యాలయ ప్రాంగణం మారుమోగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. శ్రీరామ చంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శ



ఆరోగ్యస్థితి తెలుసుకుంటున్న అనిల్ జాదవ్

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల ఇచ్చోడ మండలంలోని నేరడిగొండ(జి) వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై రిమ్స్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. సోమవారం ఆస్పత్రికి చేరుకొని వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. రోగులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, బాధితులకు అండగా ఉంటానన్నారు.

'నువ్వులు ఆరోగ్యానికి మేలు'



నువ్వు పంట సాగుకు మందులు అందజేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

సిరికొండ: మండలంలోని రాజంపేట్ గ్రామంలో సోమవారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, జగిత్యాల, వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్త పద్మజ పాల్గొని గ్రామంలోని 25 మంది రైతులకు యూరియా, భాస్వరం, పొటాష్, మైక్లోబ్యూటానిల్ వంటి మందులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ నువ్వు పంటలను సాగు చేయాలని, నువ్వులను ప్రతీరోజు ఆహారంగా తీసుకోవడంతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రాంప్రసాద్, బలరాం, శ్రీధర్, ఏఈవో ప్రవీణ్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసమే 'మై ఆటో సేఫ్'



క్యూఆర్ కోడ్ పంపిణీ చేస్తున్న సీఐ రహీంపాషా

నార్నూర్: మహిళల భద్రత కోడ్‌ను ఆటోలకు ఇస్తున్నట్లు సీఐ రహీంపాషా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆటో యూనియన్ భవన్ వద్ద ఆటోలకు మై ఆటో సేఫ్ పేరుతో క్యూఆర్ కోడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆటోలో ప్రయాణించేటప్పుడు ఏదైనా ప్రమాదం అనిపించినా, ఆకతాయిలు ఇబ్బంది పెట్టినా క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే 100 నంబర్‌కు డయల్ అవుతుందన్నారు. దీంతో మహిళలకు భద్రత కలుగుతుందన్నారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు ఫిరోజ్ ఖాన్, పోలీస్ సిబ్బంది రవీందర్ తదితరులు ఉన్నారు.

'హెచ్‌సీఏ మాటలు నమ్మి మోసపోవద్దు'



మాట్లాడుతున్న టీసీఏ కార్యదర్శి నరోత్తం రెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మాటలు నమ్మి క్రీడాకారులు మోసపోవద్దని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) జిల్లా కార్యదర్శి నరోత్తం రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీసీఏ చేస్తున్న అభివృద్ధిని గుర్తిస్తూ పనిచేయాలని బీసీసీఐ ఇదివరకే హెచ్‌సీఏను ఆదేశించినట్లు పేర్కొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడంలో హెచ్‌సీఏ కాలయాపన చేస్తుందని తెలిపారు. తెలంగాణలోని అన్ని జిల్లాల క్రీడాకారులకు సమాన ప్రాధాన్యం ఇవ్వకుండా కేవలం హైదరాబాద్ పరిధిలోని క్రీడాకారులకు హెచ్‌సీఏ ప్రాధాన్యం ఇవ్వడం సమంజసం కాదన్నారు.

బాధితులతో మానవతా దృక్పథంతో మెలగాలి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వైద్యాధికారులు

ఆదిలాబాద్‌టౌన్: హెచ్‌ఐవీ బాధితుల పట్ల మానవతా దృక్పథంతో మెలగాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్ అన్నారు. ఆదివారం రాత్రి అంతర్జాతీయ ఎయిడ్స్ మెమోరియల్ దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఐవీతో మృతిచెందిన వారికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఎయిడ్స్ నియంత్రణ అధికారి గజానంద్, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మెట్‌పెల్లివార్ శ్రీధర్, జిల్లా టీబీ నియంత్రణ అధికారి సుమలత తదితరులు పాల్గొన్నారు.

టీబీని నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: టీబీని నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని హెచ్‌ఈఓ పవార్ రవీందర్ అన్నారు. నిక్షయ్ శివిర్ 100 రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని లఖంపూర్, గోండుగూడ గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 2025 సంవత్సరం నాటికి టీబీని నిర్మూలించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. హైరిస్క్ గ్రూప్‌నకు చెందిన 60 ఏళ్లు పైబడిన వారికి డయాబెటిస్, హెచ్‌ఐవీ, పోషకాహార లోపం, గతంలో టీబీ వచ్చిన వారికి, టీబీ వ్యాధిగ్రస్తుడి కుటుంబ సభ్యులకు స్క్రీనింగ్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ సాయన్న, శ్రీనివాస్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం



పూడికతీత పనులు ప్రారంభిస్తున్న గ్రామస్తులు

తాంసి: మండల కేంద్రంలోని మత్తడివాగు పూడికతీత పనులను సోమవారం గ్రామస్తులు ప్రారంభించారు. తాంసి వాగులో పూడికతీత నీటి నిల్వ సామర్థ్యం తగ్గడంతో వాగులో నీరు లేక గ్రామస్తులతో పాటు మూగజీవాలు సైతం ఇబ్బందులు పడ్డాయి. దీంతో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా మత్తడి వాగు పూడికతీతకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలియజేశారు. దీంతో గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణ గ్రామస్తులతో కలిసి పూడికతీత పనులు ప్రారంభించారు. అన్నోజ్జుల శ్రీనివాస్, రామన్న యాదవ్, అరుణ్, గంగారెడ్డి, శ్రీనివాస్, మహేందర్, ఆశారెడ్డి తదితరులు ఉన్నారు.

యువ వికాసంలో వర్గీకరణ అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కైలాస్‌నగర్: నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని టీఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిసి సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఎస్సీ నిరుద్యోగ యువతకు వర్గీకరణ ప్రకారమే రుణాలు మంజూరు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ కుమార్, నాయకులు జెల్ల మహేందర్, కత్తి గంగాధర్ తదితరులు ఉన్నారు.

అధ్వానంగా 'డ్రెయినేజీ'



డ్రెయినేజీ నుంచి తొలగించిన చెత్త

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. చెత్తాచెదారంతో మురికి కాలువలు నిండిపోవడంతో చిన్నపాటి వర్షానికే మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో వ్యాపారులు.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని మండలవాసులు కోరుతున్నారు.

ముగిసిన వేసవి శిబిరం



ముగింపులో పాల్గొన్న డీఈవో శ్రీనివాస్ రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 1న ప్రారంభమైన కృత్రిమ మేధా శిబిరం సోమవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వేసవిలో 20 రోజుల పాటు అందించిన శిక్షణ ఎలా ఉపయోగపడిందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారు వేసవి శిబిరంలో నేర్చుకున్న వాటిని డీఈవో ఎదుట ప్రదర్శించారు. ఎంఈవో కంటి నర్సయ్య, ఎస్ఎంసీ చైర్మన్ పార్వతి, హెచ్ఎం తూరటి గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

'మా భూమి రథయాత్ర'కు విరామం

ఆదిలాబాద్‌రూరల్: తీవ్రమైన ఎండల కారణంగా 'మా భూమి రథయాత్ర'కు రెండు వారాల పాటు విరామం ఉంటుందని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్ మహరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని కార్యకర్తలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు గమనించాలని సూచించారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

ఆదిలాబాద్‌అర్బన్: బేల మండల కేంద్రంలోని ఏఎన్ గార్డెన్‌లో తన పుట్టినరోజు సందర్భంగా మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేశ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన పూసం అనుసూయబాయి (50) విద్యుదాఘాతంతో ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. ఇంట్లో పనులు చేస్తుండగా కరెంట్ షాక్ రావడంతో ఆమె మృతి చెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోథ్ ఆస్పత్రికి తరలించారు.

రేపు దిశ కమిటీ సమావేశం

కైలాస్‌నగర్: జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమీక్ష సమావేశాన్ని ఈ నెల 21న ఉదయం 10.30 గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి రాథోడ్ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పార్లమెంట్ సభ్యులు గోడం నగేశ్ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్షించనున్నట్లుగా పేర్కొన్నారు.

రేపు రెడ్డి వసతిగృహం ప్రారంభం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణం న్యూహౌజింగ్‌బోర్డు పరిధిలో గల అగ్రజాటౌన్‌షిప్ సమీపంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రెడ్డి వసతిగృహ భవనాన్ని ఈ నెల 21న ప్రారంభిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్ల నారాయణ రెడ్డి, గోపిడి రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమానికి జిల్లాలోని రెడ్డి కులస్తులు అధిక సంఖ్య లో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

రైతులు ఉన్నప్పుడే పంట కొనుగోలు చేయాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీవో

ఇంద్రవెల్లి: రైతులు ఉన్నప్పుడే జొన్న పంటను తూకం వేయాలని డీసీవో మోహన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డును సందర్శించి జొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన జొన్న పంట, రైతుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్, ఆర్ఐ మెస్రం లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

యువ నాయకుడికి దళితరత్న అవార్డు



దళితరత్న అవార్డు అందుకున్న కొర్రెల్ల మహేందర్

నార్నూర్: మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అన్నా భావుసాతె కమిటీ అధ్యక్షుడు కొర్రెల మహేందర్ సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో దళితరత్న అవార్డు అందుకున్నారు. పేద ప్రజల కోసం గత 20సంవత్సరాల నుంచి చేస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం దళితరత్న అవార్డుతో సత్కరించింది. కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కోరేపల్లి శ్రీనివాస్ మాదిగ, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.